## క్లుప్తంగా

### ఆలయ సిబ్బంది నిజాయతీ

బాసర: జ్ఞానసరస్వతీ అమ్మవారిని దర్శించుకునేందుకు నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణానికి చెందిన జ్యోతి అనే భక్తురాలు కుటుంబసభ్యులతో కలసి శుక్రవారం బాసర వచ్చారు. ఆలయ ప్రాంగణంలో భక్తురాలు పర్సు, రూ.మూడు వేల నగదును పోగొట్టుకుంది. వెంటనే సిబ్బందికి తెలియజేయడంతో వారంతా వెతుకగా.. అక్కడే విధులు నిర్వర్తిస్తున్న ఆలయ సిబ్బంది నరేశ్, హోంగార్డ్ శ్రీనివాస్‌కు పర్సు దొరికింది. వెంటనే వివరాలు తెలుసుకొని భక్తురాలికి అప్పగించి నిజాయతీ చాటుకున్నారు. ఇందుకు సిబ్బందిని పలువురు అభినందించారు.

### ఇసుక ట్రాక్టర్లు పట్టివేత



పట్టుకున్న ట్రాక్టర్ల వద్ద ఎస్సై సంజీవ్

ముధోల్: అనుమతుల్లేకుండా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై సంజీవ్‌కుమార్ తెలిపారు. లోకేశ్వరం మండలం నుంచి ముధోల్ వైపునకు వస్తున్న రెండు ట్రాక్టర్లు, ధర్మాబాద్ నుంచి వస్తున్న ఒక ట్రాక్టర్‌ను శుక్రవారం ముధోల్‌లో పట్టుకున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. వాహనాలను సీజ్ చేయడంతోపాటు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

### వారసంత వేలం వాయిదా

తానూరు: మండలకేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో శుక్రవారం నిర్వహించాల్సిన వారసంత వేలం అనివార్య కారణాలతో వాయిదా పడినట్లు ఎంపీడీవో నసీరొద్దీన్ ఓ ప్రకటనలో తెలిపారు. మళ్లీ వారసంత వేలం నిర్వహించే తేదీని త్వరలో ప్రకటిస్తామని పేర్కొన్నారు.

### ఇన్‌చార్జి ఎంపీవోగా రహీం

భైంసారూరల్: భైంసా మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఇన్‌చార్జి ఎంపీవోగా ఎంఏ రహీం శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంపీవోగా పని చేసిన మోజం హుస్సేన్ బదిలీపై కుమురంభీం జిల్లా ఆసిఫాబాద్‌కు వెళ్లగా కుంటాల ఎంపీవోగా పని చేస్తున్న రహీం భైంసా ఇన్‌చార్జి ఎంపీవోగా అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

### రేషన్ దుకాణాలు తనిఖీ



పార్‌పెల్లిలో పరిశీలిస్తున్న డీటీ అబ్దుల్ అజీజ్

లక్ష్మణచాంద: మండలంలోని పార్‌పెల్లి, మల్లాపూర్, మనిపెల్లి, చింతల్‌చాంద, చామన్‌పెల్లి గ్రామాల్లోని ఆరు రేషన్ దుకాణాలను డిప్యూటీ తహసీల్దార్ అబ్దుల్ అజీజ్ తనిఖీ చేశారు. వచ్చే నెల నుంచి సన్న బియ్యం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రేషన్ దుకాణాలు తనిఖీ చేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి నిల్వ ఉన్న బియ్యం వివరాలు తెలుసుకున్నారు.

### మద్యం తాగి నడుపొద్దు



బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్ష చేస్తున్న ఎస్సై అశోక్

లోకేశ్వరం: డ్రైవర్లు మద్యం తాగి వాహనాలు నడుపొద్దని ఎస్సై అశోక్ అన్నారు. శుక్రవారం మండలంలోని మన్మద్ ఎక్స్ రోడ్డు వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఈసందర్భంగా ఎస్సై మాట్లాడుతూ అతివేగంతోనే ఎక్కువ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. రోడ్డు భద్రత నిబంధనలు పాటిస్తూ వాహనదారులు తమ వెంట అన్ని ధ్రువపత్రాలను ఉంచుకోవాలని సూచించారు. ఆయన వెంట పోలీస్ సిబ్బంది ఉన్నారు.

### అగ్నివీర్‌కు ఎంపిక

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని బేస్తవార్‌పేట్‌కు చెందిన ఏలేటి నవీన–హనుమాన్ ప్రసాద్‌చారి దంపతుల కుమారుడు ధనుశ్ తొలి ప్రయత్నంలోనే ఆర్మీ విభాగంలో అగ్నివీర్‌గా ఎంపికయ్యాడు. ధనుశ్ తల్లి బీడీ కార్మికురాలు కాగా తండ్రి వడ్రంగి పని చేస్తున్నారు. దేశానికి సేవ చేయాలనే సంకల్పంతో కష్టపడి అగ్నివీర్‌గా ఎంపికైనట్లు ధనుశ్ తెలిపాడు. యువకుడిని పలువురు అభినందించారు.

### సీసీ రోడ్డు పనులు ప్రారంభం

ముధోల్: మండలకేంద్రంలో రూ.13.50 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం బీజేపీ నాయకులు, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు ప్రారంభించారు. శ్రీ పశుపతినాథ్ ఆలయ ఆవరణలో రూ.8లక్షల 50వేలు, ఆలయం నుంచి ప్రధాన రోడ్డు వరకు రూ.ఐదు లక్షలతో సీసీ రోడ్డు నిర్మించనున్నట్లు వారు పేర్కొన్నారు. బీజేపీ మండలాధ్యక్షుడు కోరి పోతన్న, దేవోజీ భూమేశ్, వీడీసీ అధ్యక్షుడు విఠల్, వెంకటేశ్, రమేశ్ సాయి, మోహన్‌యాదవ్, అనిల్ ఉన్నారు.

# ముస్తాబైన రామాలయం



కామోల్‌లో ముస్తాబైన రామాలయం

- కామోల్‌లో ఉగాది నుంచి ఉత్సవాలు
- తొమ్మిది రోజుల పాటు నిర్వహణ
- తరలిరానున్న భక్తజనం

స్వామివారు

భైంసారూరల్: మండలంలోని కామోల్ గ్రామంలో సుమారు 300 ఏళ్లకుపైగా శ్రీరామనవమి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. గతంలో ఛత్రపతి శివాజీ మహరాజ్ కుమారుడు సంభాజీ మహరాజ్.. మహారాష్ట్రలోని నాసిక్ ప్రాంతానికి చెందిన దయారాం రాజారాం దేశ్‌పాండేలను తమ రాజ్యంలోని కామోల్ గ్రామం జాగీర్దారుగా ప్రకటించారు. నాసిక్ రామమందిరంలో ప్రత్యేక పూజలు చేసే దయారాం రాజారాం దేశ్‌పాండే.. శ్రీరామచంద్రుని కొలిచేందుకు అప్పట్లోనే కామోల్‌లో పూజమందిరం నిర్మించారు. మహారాష్ట్రలోని నాసిక్, పైటాన్, మదల్‌గావ్, ఔరంగాబాద్, దారూర్ ప్రాంతంలో పంచాంగాలు తయారు చేసే బ్రాహ్మణులు వేదపండితులను కామోల్ గ్రామం తీసుకొచ్చి ఉగాది పర్వదినం నుంచి తొమ్మిది రోజులు ఇక్కడి పూజా మందిరంలో రామనవమి ఉత్సవాలు నిర్వహించేవారు. మహారాష్ట్రలోని నాసిక్‌లో శాలిగ్రామ్ శిలతో చెక్కిన రామలక్ష్మణుల విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఇక్కడ కూడా నల్లని శాలిగ్రామ్ శిలతో సీతారామ, లక్ష్మణుల విగ్రహాలను చెక్కించారు. చుట్టు పక్కల ఆలయాల్లో దేవతామూర్తులు పాలరాతి విగ్రహాల్లో ఉంటే ఇక్కడ మాత్రం నల్లని శాలిగ్రామ్ శిలతో చెక్కిన దేవతామూర్తులు దర్శనమిస్తాయి.

**నవమి నాడు రాముడి పుట్టినరోజు వేడుకలు**

తొమ్మిది రోజుల ఉత్సవాల అనంతరం నవమి రోజు కామోల్ గ్రామంలో శ్రీరామచంద్రుడి జన్మదిన వేడుకలు నిర్వహిస్తారు. ఇదేరోజు భద్రాచలంలో శ్రీ సీతారాముల కల్యాణం జరుగనుంది.

**కొనసాగుతున్న సంప్రదాయం..**

వందల ఏళ్లుగా కామోల్‌లో ఉన్న సంప్రదాయాన్ని దయారాంరాజారాం దేశ్‌పాండే వంశీయులు కొనసాగిస్తూ వచ్చారు. 1978లో ఆయన మనుమడు నారాయణరావు దేశ్‌పాండే ఆలయ నిర్వహణ, ఉత్సవాల బాధ్యతను గ్రామస్తులకు అప్పగించారు. అప్పటినుంచి ఆలయ కమిటీ ఏర్పాటు చేసి ఉత్సవాలు, పూజలు నిర్వహిస్తూ వచ్చారు. పదేళ్ల కిందట ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు కంచెర్ల గోపన్నలుగా అవతారం ఎత్తి సుమారు రూ.50 లక్షలతో మందిరం, సత్రం నిర్మించారు.

**అన్ని ఏర్పాట్లు..**

ఉగాది నుంచి ప్రారంభమయ్యే శ్రీరామనవమి వేడుకలకు ఆలయం ముస్తాబవుతోంది. ఇప్పటికే రంగులు వేసి ఆలయ ప్రాంగణంలో దేవతామూర్తుల చిత్రాలను గీస్తున్నారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాటు చేస్తున్నారు. చివరిరోజు వేడుకల అనంతరం కుస్తీ పోటీలు నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

### దీక్షలు స్వీకరణ



దీక్షలు స్వీకరించిన స్వాములు

భైంసారూరల్: మండలంలోని కామోల్ గ్రామంలో శుక్రవారం మౌనస్వామి రోటిగూడ మహరాజ్ చేతుల మీదుగా సుమారు 60 మంది శ్రీరామ దీక్షలు స్వీకరించారు. తొమ్మిది రోజులు ఆలయంలోనే నిద్రిస్తారు. రోజు తెల్లవారుజామున గ్రామంలో పారాయణం చేస్తారు. అనంతరం రామమందిరంలో వాల్మీకి రామాయణం, ఆధ్యాత్మిక రామాయణం, వేద పారాయణం నిర్వహిస్తారు. రోజు హరికీర్తనలు జరిపిస్తారు.

## గ్రామాలు శుభ్రంగా ఉండేలా చూడాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి

భైంసారూరల్: పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించి.. గ్రామాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి సూచించారు. శుక్రవారం భైంసా మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందికి నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో మాట్లాడారు. గ్రామాల్లో మురుగుల కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. గ్రామస్తులకు క్లోరినేషన్ నీటిని అందిస్తూ.. రోడ్లపై చెత్తాచెదారం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నర్సరీల్లో అన్ని రకాల పూలు, పండ్ల మొక్కలను పెంచుతూ సకాలంలో నీటిని అందించాలని పేర్కొన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి ఎంపీవో ఎంఏ రహీం, ఈసీ రాజ్‌కుమార్, కార్యదర్శులు ఈజీఎస్ సిబ్బంది ఉన్నారు.

## పనులకు వెళ్లి రైతు కూలీ మృతి



శంకర్(ఫైల్)

భైంసాటౌన్: పంట చేనులో పనిచేస్తూ ఓ రైతు కూలీ మృతి చెందిన ఘటన శుక్రవారం పట్టణంలో చోటు చేసుకొంది. స్థానికులు, బాధిత కుటుంబీకుల కథనం ప్రకారం.. కిసాన్‌గల్లికి చెందిన కత్‌గాం శంకర్(52) రోజంతా మొక్కజొన్న చేనుకు నీరు పెట్టాడు. ఈ క్రమంలో సాయంత్రం ఇంటికి వచ్చే క్రమంలో ఒక్కసారిగా చేనులోనే కుప్పకూలాడు. చుట్టుపక్కల రైతులు గమనించి శంకర్ కుటుంబసభ్యులకు సమాచారమిచ్చారు. ఎండదెబ్బతో మృతి చెంది ఉంటాడని వారు భావిస్తున్నారు. మృతుడికి భార్య, నలుగురు కూతుళ్లు ఉన్నారు.



**హరిత మార్గం.. ఆహ్లాద భరితం**

లోకేశ్వరం: మండలకేంద్రం నుంచి భైంసాకు వెళ్లే మార్గంలో ఏపుగా పెరిగిన చెట్లు ఆహ్లాదం పంచుతున్నాయి. పెరుగుతున్న ఎండలకు ప్రయాణికులు ఈ చెట్ల నీడ కింద కాసేపు ఆగి సేద తీరుతున్నారు.

## వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా నిరసన



ఖానాపూర్‌లో నిరసన తెలుపుతున్న ముస్లింలు



కడెం : ఎలగడపలో..



కుభీర్‌లో..

ఖానాపూర్: ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు పిలుపు మేరకు వక్ఫ్ సవరణ బిల్లు–2024కు వ్యతిరేకంగా పట్టణంలోని మదీనా మసీద్ వద్ద ముస్లింలు చేతికి నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. నాయకులు మాట్లాడుతూ మజీద్‌లు, ఈద్గాలు, మదర్సాలు, దర్గాలను లాక్కునేందుకు ఉద్దేశించిన కపట కుట్రగా ఈ బిల్లును పేర్కొన్నారు. ముఫ్తీ అథర్, షబ్బీర్‌పాషా, సలీంఖాన్, వహీం, చాంద్‌పాషా, షాకీర్, అయూబ్, హబీబ్, అహ్మద్, మీర్జాబేగ్, మహమూద్, షకీల్, ఖమర్, ఖాక్, కలీం, అమీర్ తదితరులు ఉన్నారు.

కడెం: వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుకు వ్యతిరేకంగా ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు పిలుపు మేరకు శుక్రవారం మండలంలోని ఎలగడప గ్రామంలోని మసీద్ వద్ద ముస్లింలు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ బిల్లును పార్లమెంట్‌లో ఆమోదిస్తే ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఇందులో జామ మసీద్ సదర్ తురబ్ మౌలానా, అర్షద్, మహమ్మద్ సలీం, అబ్దుల్ రహీం, రియాజ్, సాబిల్ తదితరులున్నారు.

కుభీర్: మండలకేంద్రంలోని మసీద్ వద్ద ముస్లింలు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. వక్ఫ్ బోర్డు రద్దుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మండల మాజీ ఉపాధ్యక్షుడు మొహినొద్దీన్, మసీద్ కమిటీ సభ్యులు తదితరులు ఉన్నారు.

### విద్యార్థులకు బ్యాగులు పంపిణీ



బ్యాగులు అందుకున్న విద్యార్థులతో సభ్యులు

మామడ: మండలంలోని పొన్కల్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఎస్ఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో శుక్రవారం బ్యాగులు పంపిణీ చేశారు. ట్రస్టు సభ్యులు నరేశ్‌రెడ్డి 50 మంది విద్యార్థులకు బ్యాగులు అందించారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు అరవింద్‌కుమార్, ఉపాధ్యాయులు అపర్ణ, రమేశ్, నాయకులు గంగారెడ్డి, నర్సారెడ్డి తదితరులు ఉన్నారు.

## శాంతకుమార్ సేవలు మరువలేనివి



దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

సోన్: వేలాదిమంది విద్యార్థుల జీవితాల్ని ఉన్నతంగా తీర్చిదిద్దిన సోన్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం శాంతకుమార్ సేవలు మరువలేనివని ఎంఈవో పరమేశ్వర్ అన్నారు. శుక్రవారం సోన్ ప్రాథమిక పాఠశాలలో రెండేళ్లపాటు విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందుతున్న శాంతకుమార్‌కు మండలంలోని ఉపాధ్యాయులు, బంధుమిత్రులు వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో దిలావర్‌పూర్ ఎంఈవో శంకర్, సోన్ జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు ఆరాధన, అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్ గంగాధరయ్య, వీడీసీ సభ్యులు, వివిధ సంఘాల బాధ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్



ముధోల్ : ఇఫ్తార్ విందులో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి



దిలావర్‌పూర్‌లో ఇఫ్తార్ విందులో నాయకులు

ముధోల్: మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు అని ముధోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి పేర్కొనానరు. శుక్రవారం మండలకేంద్రంలోని పాత బస్టాండ్‌లో శుక్రవారం ముస్లింలకు ఇఫ్తార్‌విందు ఏర్పాటు చేశారు. మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్‌రావుపటేల్, ఎస్సై సంజీవ్ విందులో పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలిపారు.

దిలావర్‌పూర్: మండలకేంద్రంలోని మసీదు ప్రాంగణంలో శుక్రవారం కాంగ్రెస్ నాయకులు కట్కం రాజారెడ్డి.. ముస్లింలకు ఇఫ్తార్‌విందు ఏర్పాటు చేశారు. అర్గుల రమణ, శేష సలీం, బొల్ల దయాకర్, బెల్లాజి రాజు, నంద ముత్యం, దుప్పి సాయన్న, సయ్యద్ యూసుఫ్, శ్రీహరి పాల్గొన్నారు.

## భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాలి

- మాజీ ఎమ్మెల్యే నారాయణరావు పటేల్
- గ్రామాల్లో జైబాపు, జైభీమ్, జైసంవిధాన్



కుభీర్: హల్దాలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బి.నారాయణ్‌రావు పటేల్



సోన్‌లో రాజేందర్‌ను సన్మానిస్తున్న కాంగ్రెస్ నేతలు



నిర్మల్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కుభీర్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీస్తోందని.. భారత రాజ్యాంగాన్ని కాపాడుకునేందుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలని ముధోల్ మాజీ ఎమ్మెల్యే బి.నారాయణరావు పటేల్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని హల్దాలో జైబాపు.. జైభీమ్.. జైసంవిధాన్ కార్యక్రమం నిర్వహించగా ఆయన పాల్గొని మాట్లాడారు. ఇచ్చిన హామీ మేరకు అన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తామని.. అప్పటివరకు ఓపిక పట్టాలని ప్రజలను కోరారు. ఓ వ్యక్తి లేచి ఇందిరమ్మ ఇళ్లు అర్హులకు రాలేదని తెలుపగా.. అనర్హులకు ఇళ్లు కేటాయిస్తే కలెక్టర్‌కు ఫిర్యాదు చేసి సంబంధిత గ్రామపంచాయతీ కార్యదర్శిని సస్పెండ్ చేయిస్తామని అన్నారు. మాజీ సర్పంచులు దేవేందర్, రాందాస్, హన్మాండ్లు, బంక బాబు, బషీర్, కొత్తింటి హన్మాండ్లు, సాహెబ్‌రావు, శంకర్‌చంద్రే, రాములు తదితరులు ఉన్నారు.

ముధోల్: మండలంలోని ఎడ్‌బిడ్‌లో జైబాపు జైభీమ్ జై సంవిధాన్ కార్యక్రమంలో నారాయణ్‌రావు పటేల్ మాట్లాడారు. ఈ కార్యక్రమానికి ఇంటింటికీ తీసుకెళ్లాలని కాంగ్రెస్ కార్యకర్తలకు సూచించారు. కులమతాల పేరిట ఘర్షణ సృష్టిస్తూ దేశాన్ని బీజేపీ ప్రభుత్వం సర్వనాశనం చేస్తుందని ఆరోపించారు. సారంగాపూర్ ఏఎంసీ చైర్మన్ అబ్దుల్, ముధోల్ ఇన్‌చార్జి, మహిళా ఉప అధ్యక్షురాలు కృష్ణవేణి, జిల్లా బ్లాక్ కమిటీ అధ్యక్షురాలు లక్ష్మీ కొట్టే, శేఖర్, శంకర్ చెంద్రే, ముత్యంరెడ్డి, దేవిదాస్ పాల్గొన్నారు.

నిర్మల్‌చైన్‌గేట్: రాజ్యాంగాన్ని అవమానపరుస్తూ బీజేపీ ప్రభుత్వం అప్రజాస్వామిక పాలన కొనసాగిస్తుందని జై బాపు.. జై భీమ్.. జై సంవిధాన్ కార్యక్రమ జిల్లా ఇన్‌చార్జి రాజుర సత్యం అన్నారు. శుక్రవారం పట్టణంలోని మారుతి కన్వెన్షన్ హాలులో జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమం ఏర్పాటు చేయగా.. నిర్మల్ నియోజకవర్గంలోని నాయకులు కార్యకర్తలు హాజరై ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో అప్పాల గణేశ్, సమర సింహారెడ్డి, గొంగోని బురజ్, కొండ శ్రీనివాస్, మహమ్మద్ అజార్, వహీద్ అహ్మద్ ఖాన్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

సోన్: మండలకేంద్రంలో జైబాపు.. జైభీమ్.. జైసంవిధాన్ కార్యక్రమం నిర్వహించగా గ్రంథాలయ మాజీ చైర్మన్ ఎర్రవోతు రాజేందర్ పాల్గొన్నారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నక్కల మధుకర్‌రెడ్డి, గడ్డం స్వామి, మొహీనుద్దీన్, రాజనర్సింహారెడ్డి అంబేకర్ ప్రసాద్, కాంతయ్య తదితరులు పాల్గొన్నారు.

దస్తురాబాద్: మండలకేంద్రంలో జైబాపు.. జైభీమ్.. జైసంవిధాన్ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి రాంభూపాల్ రెడ్డి పాల్గొన్నారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు దుర్గం మల్లేశ్, మండల కోఆర్డినేటర్ భీంరెడ్డి, మాజీ ఎంపీపీ కిషన్, రామడుగు రమేశ్‌రావ్, చుంచు వెంకన్న, నరేశ్‌రెడ్డి తదితరులున్నారు.

కుంటాల: బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని మార్చే కుట్ర చేస్తోందని జైబాపు.. జైభీమ్.. జైసంవిధాన్ కార్యక్రమం కాంగ్రెస్ పార్టీ జిల్లా ఇన్‌చార్జి రాంగోపాల్ అన్నారు. కుంటాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జెడ్పీ మాజీ చైర్మన్ జుట్టు అశోక్, సయ్యాజీ భోజారాంపటేల్, సాద సుదర్శన్, సింగిల్‌విండో చైర్మన్ సట్ల గజ్జారాం, లక్ష్మణ్, వెంకటేశ్, మహేందర్ పాల్గొన్నారు.

సారంగపూర్: మండలకేంద్రం సమీపంలోని కరుణాకర్‌రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో పార్టీ కార్యకర్తలు, నాయకులతో జైబాపు జైభీమ్ జైసంవిధాన్ కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. భైంసా ఏఎంసీ చైర్మన్, కార్యక్రమ మండల ఇన్‌చార్జి సిందేకర్ ఆనంద్‌రావు, బొల్లోజి నర్సయ్య, మాజీ జెడ్పీటీసీ రాజేశ్వర్‌రెడ్డి, రొడ్డ మారుతి, దశరథ రాజేశ్వర్, ముత్యంరెడ్డి, అహ్మద్ ముక్తార్, నర్సాగౌడ్, కైలాశ్ ఉన్నారు.

లక్ష్మణచాంద: మండలంలోని తిర్పెల్లిలో జైబాపు.. జైభీమ్.. జైసంవిధాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జెండా గద్దె నిర్మాణానికి భూమిపూజ చేశారు. నిర్మల్ ఏఎంసీ వైస్‌చైర్మన్ ఈటెల శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు రాజేశ్వర్, మాజీ సర్పంచ్ నారాయణ, ప్రభాకర్, భీమేశ్, అశోక్, భూమన్న పాల్గొన్నారు.

మామడ: మండలకేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల ఇన్‌చార్జి పాల్దె అనిల్ ఆధ్వర్యంలో జైబాపు.. జైభీమ్.. జైసంవిధాన్ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. లింగారెడ్డి, గంగారెడ్డి, రఫీ, బాపయ్య, వికాస్‌రెడ్డి, నర్సారెడ్డి పాల్గొన్నారు.

నిర్మల్: నర్సాపూర్(జి) మండలంలో జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ ఏనుగు లింగారెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గడ్డం ఇంద్రకరణ్‌రెడ్డి, సమంత ఫౌండేషన్ చైర్మన్ సమత సుదర్శన్, ఏఎంసీ డైరెక్టర్ అజీమ్, నాకిడి నవీన్ , దేవేందర్‌పటేల్ తదితరులు పాల్గొన్నారు.

## సంక్షిప్త వార్తలు

**ఏర్పాట్లు పరిశీలన**

కుభీర్: రంజాన్ పండుగ నేపథ్యంలో మండలకేంద్రంలో శుక్రవారం ఈద్గాం వద్ద ఏర్పాట్లను ఎంపీడీవో నవనీత్‌కుమార్, ఎంపీవో మోహన్‌సింగ్, ఈవో గౌతమ్ పరిశీలించారు. తగిన ఏర్పాట్లు చేయాలని గ్రామపంచాయతీ సిబ్బందికి ఆదేశించారు

**డాక్టర్ సేవలు మరువలేనివి**

దస్తురాబాద్: మండలకేంద్రంలోని పీహెచ్‌సీలో విధులు నిర్వర్తించిన డాక్టర్ విజయ్‌కుమార్ సేవలు మరువలేనివని హెచ్ఈఓ కన్నయ్య, వైద్యసిబ్బంది పేర్కొన్నారు. శుక్రవారం దస్తురాబాద్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఉస్మానియా యూనివర్సిటీలో పీజీ విభాగంలో సీటు పొందడంతో కోర్సు చదివేందుకు వెళ్తున్నారని హర్షం వ్యక్తం చేశారు. అనంతరం వైద్యశాఖ ఆధ్వర్యంలో ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ లలిత, వైద్యసిబ్బంది, ఆశకార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**మట్టిపరీక్షలు చేసుకోవాలి**

సోన్: రైతులు తమ చేన్లలో మట్టి పరీక్షలు చేయించుకొని.. వాటి ఫలితాల ఆధారంగా ఎరువులు వినియోగించాలని వ్యవసాయాధికారులు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని న్యూవెల్మల్‌లో రైతునేస్తం కార్యక్రమంలో భాగంగా భూసార పరీక్ష కేంద్రాన్ని శుక్రవారం వ్యవసాయ సంస్థ సీఈవో మెండు శ్రీనివాస్, వ్యవసాయ అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేవలం ఐదు నిమిషాల్లోనే భూసార పరీక్షల రిపోర్టు రైతులకు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏవో వినోద్‌కుమార్, ఏఈఓలు ఉమామహేశ్వరి అశోక్‌కుమార్, కార్యదర్శి, సరిత, భూపాల్ రెడ్డి, రైతులు, నిర్వాహకులు కొండ రవి, బొండ భోజన్న, వీడీసీ సభ్యులు తదితరులున్నారు.

**దరఖాస్తులు చేసుకోవాలి**

కుంటాల: వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద 50 శాతం రాయితీపై ప్రభుత్వం అందించే పనిముట్ల కోసం మహిళా రైతులు దరఖాస్తు చేసుకోవాలని ఏవో విక్రమ్ ఓ ప్రకటనలో కోరారు. వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

**ఆలయ నిర్మాణ పనులపై సమావేశం**

ఖానాపూర్: పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీలో ఉన్న సీతారామచంద్ర స్వామి ఆలయ నిర్మాణ పనుల సన్నాహక సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. దీనికి హైదరాబాద్‌కు చెందిన స్థపతి సూర్యప్రకాశ్ హాజరై ఆలయ కొలతలు సేకరించారు. ఈసందర్భంగా ఆలయ డిజైనింగ్ గురించి కమిటీ సభ్యులతో చర్చించారు. కార్యక్రమంలో అల్లాడి వెంకటేశ్వర్లు, గొందాల శ్రీనివాస్, కీర్తి రాఘవశర్మ, సతీశ్‌రావు, సుదర్శన్, చంద్రహాస్, కిషన్, రాజశేఖర్, రాము, భీమేశ్వర్, రవిచరణ్, రాజేశ్వర్ తదితరులు ఉన్నారు.

**పాక్షికంగా ఇల్లు దగ్ధం**

నిర్మల్: నర్సాపూర్(జి) మండలకేంద్రంలోని పిట్ల భోజన్నకు చెందిన ఇల్లు శుక్రవారం ప్రమాదవశాత్తు నిప్పు అంటుకొని కొంతమేర కాలిపోయింది. స్థానికులు స్పందించి మంటలు ఆర్పివేయడంతో ఎలాంటి ఆస్తి, ప్రాణనష్టం జరగలేదు. దీంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

### లీకేజీలకు మరమ్మతులు చేయిస్తాం



లీకేజీని పరిశీలిస్తున్న కమిషనర్

ఖానాపూర్: తాగునీటి పైప్ లైన్ల లీకేజీలకు మరమ్మతులు చేయించి సమస్య పరిష్కరిస్తామని మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ అన్నారు. పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీ లో పైప్‌లైన్లకు లీకేజీలు ఏర్పడి తాగునీరు కలుషితం అవుతుందని కాలనీ వాసులు విన్నవించడంతో శుక్రవారం వచ్చి పరిశీలించారు. అనంతరం లీకేజీలకు మరమ్మతులు చేయించారు. పట్టణ పరిధిలో లీకేజీలు, నీటి సమస్య ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. ఆయన వెంట పలువురు ఉన్నారు.